www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 ఫిబ్రవరి 2024
5
తిరుపతి



గురుమూర్తికే తిరుపతి ఎంపి పగ్గాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి పార్లమెంట్ పగ్గాలు ఎంపి మద్దెల గురుమూర్తికే అప్పగిస్తూ అధిష్టానం వెనకడుగు వేసింది. తొలుత సత్యవేడు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా నియమించి, అక్కడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఆదిమూలానికి పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. అయితే ఆదిమూలం టిడిపి తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధం కావడంతో గురుమూర్తిని తిరిగి తిరుపతి పార్లమెంట్‌కే బాధ్యత అప్పగించింది. జీడీనెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ను సత్యవేడు ఇన్‌ఛార్జిగా ప్రకటించింది. రాజేష్ పెద్దిరెడ్డి అనుచరుడు. మాజీ మంత్రి గుబమ్మడి కుతూహలమ్మ అల్లుడు కావడం విశేషం. రెండు రోజుల క్రితం 'ప్రజాశక్తి'లో రాజేష్‌కు తిరుపతి ఎంపి పగ్గాలు ఇస్తారని ప్రచురించింది. అయితే అనూహ్య పరిణామాల నేపథ్యంలో గురుమూర్తికి ఎంపి పగ్గాలు అప్పగించి, రాజేష్‌కు సత్యవేడు బాధ్యత అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏదిఏమైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేలోపు ప్రకటించిన సీటు సైతం ప్రకటించినట్లుగా ఉంటుందో లేదో వేచి చూడాల్సిందే.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా తిరుపతి ఆర్డీవో కార్యాలయం ముందు బుధవారం సాయంత్రం నిరసన చేపట్టారు. గత రెండు నెలలుగా డిమాండ్ చేస్తున్నా ఆర్థిక బకాయిలు ఇంతవరకూ జమ కాలేదని, వాటిని వెంటనే బేషరతుగా జమ చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా పీ.ఎఫ్ నిధులు వారి వారి వ్యక్తిగత అకౌంట్లో జమ కాలేదు. వడ్డీ కూడా జమ కాలేదు. కనీసం ఎంత అమౌంట్ ఉందో చూసుకోవడానికి పి. యఫ్ స్లిప్పులు కూడా ఆన్లైన్లో కనిపించలేదని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఉపయోగం లేకుండా పోతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా సరెండర్ లీవులు, పిఎఫ్ లోన్లు, ఏపీజిఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, లోన్లు మెడికల్ బిల్లులు ఏవీ చెల్లింపులు జరగడంలేదని, వెంటనే ఆర్థిక బకాయిలు చెల్లించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సంఘం నియమించిన సందర్భంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పత్తిపాటి రమేష్ నాయుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, డివిజన్ కన్వీనర్ బండి మధుసూదన రెడ్డి, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, సి సురేష్, అవనిగడ్డ పద్మజ పాల్గొన్నారు.

టిటిడి అటవీ కార్మికులకు మద్దతుగా..

నేడు ప్రముఖులతో ఎడిబిల్డింగ్ వద్ద దీక్ష

క్షీణిస్తున్న దీక్షా కార్మికుల ఆరోగ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నిరాహారదీక్ష చేస్తున్న టిటిడి అటవీ కార్మికుల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. బీపీ, సుగర్ లెవల్ బాగా పడిపోవడంతో వారి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు. మూడు సంవత్సరాల రెండు నెలలుగా కార్మికులు రిలేదీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిరాహారదీక్షలకు పూనుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సహా తొమ్మిది

మంది నిరాహారదీక్ష చేస్తుండగా టిటిడి పోలీసులను ఉసిగొల్పి అరెస్టు చేయించింది. అయితే కార్మికులు మొక్కవోని దీక్షతో రెండో విడత మరో ఏడుగురు కార్మికులు దీక్షలను కొనసాగిస్తున్నారు. సమస్య పరిష్కరించేంత వరకూ పట్టు వీడేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి దీక్షలకు మద్దతుగా గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా అన్ని రాజకీయ పక్షాలు, తిరుపతి ప్రముఖులతో ఒకరోజు నిరాహార దీక్షను చేపట్టాలని నిర్ణయించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, తిరుపతిలోని ప్రముఖులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో తమిళ హీరో ధనుష్

ప్రజాశక్తి -తిరుమల

తమిళ సినీ నటుడు ధనుష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం తిరుపతిలో సినిమా షూటింగ్ షెడ్యూల్ లో పాల్గొన్న ధనుష్ రాత్రి తిరుమలకు చేరుకొని బుధవారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ధనుష్ కు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు.

సామ్రాజ్యవాదాన్ని అంతమొందించాలి

ప్రజాశక్తి - క్యాంపస్

భారతదేశం బాగు కోసం మరో లెనిన్ రావాలని... పీడిత వర్గాలను దోపిడీ చేస్తున్న సామ్రాజ్యవాదం అంతమొందించాలని వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. రష్యా విప్లవ పితామహులు లెనిన్ శత వర్ధంతి వేడుకలు తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అభ్యుదయ వేదిక, అఖిల భారత విద్యార్థి సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు అభ్యుదయ వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎం.డి. ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ 'సామ్రాజ్యవాదం-లెనినిజం' అనే అంశంపై ఉపన్యసించారు. లెనిన్ గా సుప్రసిద్ధుడైన వ్లాదిమిర్ ఇల్యీచ్ ఉల్యనొవ్ భౌతికంగా మరణించి ఇప్పటికి వందేళ్లు నిండాయన్నారు. 54ఏళ్లు నిండ కుండానే మరణించినా... అందులో 35ఏళ్లకు మించి ఆయన పీడిత వర్గ విముక్తి కోసం పని చేశారన్నారు. ఒక మనిషిని మరొక మనిషి... ఒక జాతిని మరొక జాతి పీడించడానికి వీలులేని ఒక సమతా సుందర స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత లెనిన్ దే అన్నారు. స్వల్ప జీవిత కాలంలోనే ఆయన చేసిన అధ్యయనం, రాసిన రచనలు, ఉపన్యాసం, రచన... ఎదుటివారిని మెప్పించే వాదన పటిమ... నాయకత్వం వహించిన ఉద్యమాలు, అనుభవించిన నిర్బంధాలూ, తప్పించుకున్న హత్యా ప్రయత్నాలూ, స్థాపించిన మొట్టమొదటి కార్మిక కర్షక రాజ్యం... నిర్వహించిన కార్మికవర్గ సోషలిస్టు సమాజ నిర్మాణం, సమయ సందర్భాలకు తగినట్టు వ్యూహాలను మార్చిన చాతుర్యం, తన స్థల కాలాలకు మాత్రమే కాదు, ప్రపంచమంతటికీ,

సర్వకాలాలకూ ప్రాసంగికమైన ఆలోచన, ఆచరణలు - లెనిన్ జీవితం ఒక ప్రయోగమని వేణుగోపాల్ చెప్పారు. సామ్రాజ్యవాదాన్ని కూల్చడం అనేది ప్రజల ముందు వున్న కర్తవ్యమని వేణుగోపాల్ చెప్పారు. ఎఐఎస్ఎఫ్ పూర్వ నాయకులు పి.హరినాథరెడ్డి, ఎం.వెంకటరమణ, కె.శివారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ధార్మిక సదస్సు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - తిరుమల

ఫిబ్రవరి 3-5 తేదీల్లో తిరుమలలో జరగనున్న వేద ధార్మిక సదస్సు ఏర్పాట్లను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. దాదాపు 57 మంది పీఠాధిపతుల సలహాలు తీసుకోనున్నారు. బాలబాలికల స్థాయి నుంచే హిందూ వ్యాప్తి చేయాలని కంకణం కట్టుకున్నామని, ఈ ధార్మిక సదస్సుతో దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ఉద్యమం కలుగుతుందన్నారు.

ముక్కంటి ఈవోకు పితృవియోగం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ కార్య నిర్వహణాధికారి కేఎస్ రామారావుకు పితృవియోగం జరిగింది. రామారావు తండ్రి డాక్టర్ కె.సత్యనారాయణ (91) వయసు పైబడటంతో పాటు అనారోగ్యం కారణంగా బుధవారం మృతిచెందారు. ఆయన అంతిమయాత్ర గురువారం ఉదయం 9గంటలకు శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీ నుంచి ప్రారంభం అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'సాగరమాల' నిర్వాసితులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - కోట నెల్లూరుపల్లి కొత్తపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న సాగరమాల రోడ్డుకు చెందిన రైతులకు న్యాయం చేస్తామని వైసిపి యువ నాయకులు నేదురుమల్లి హరిచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ సాగరమాల భూములకు సంబంధించి ఒకరి భూములకు రావాలసిన నగదు మరొకరికి రావడం, అర్హులైన రైతులకు పరిహారం ఇవ్వలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన నేదురుమల్లి హరిచంద్రారెడ్డి గూడూరు ఆర్డీవోతో మాట్లాడారు. బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు.

రుయాలో సెక్యూరిటీల ఆగడాలను అరికట్టాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రుయా హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఏ వన్ సర్వీస్‌లో పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్నటువంటి మహిళా కార్మికులపై సెక్యూరిటీ సూపర్వైజర్ మహేంద్ర అతని అనుచరులు చేస్తున్నటువంటి దాడికి నిరసనగా బుధవారం రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆఫీస్ ముందు మెయిన్ బిల్డింగ్ గేటు దగ్గర ఏవన్ సర్వీస్ లో పనిచేస్తున్నటువంటి కార్మికులు ధర్నా చేశారు. సెక్యూరిటీల ఆగడాలను అరికట్టాలని, మహేంద్ర పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సులోచన, లీలావతి మాట్లాడుతూ రుయా హాస్పిటల్లో వార్డుల్లో బయట లోపల పరిసర ప్రాంతాల్లో కష్టించి పని చేస్తున్నటువంటి మహిళా కార్మికులను సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్నటువంటి మహేంద్ర అతని అనుచరులు తీవ్ర దాడి చేస్తున్నారని, రూపా అనే మహిళను మహేంద్ర చేత్తో పట్టి ఆమెను తోసి కిందకు పడేసి బండ బూతులు తిడుతూ చెప్పుకోలేని విధంగా మాట్లాడిన విధానాన్ని కార్మికులందరూ తీవ్రంగా వ్యతిరేకించారు కార్మికుల మధ్య చిచ్చు పెడుతున్నటువంటి సెక్యూరిటీ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటేష్, కిరణ్, కుంటెమ్మ, ఉష, నీలవేణి, లక్ష్మమ్మ, బేబి, నీలావతి పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి - తిరుమల

డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

స్మశానానికి దారి చూపండి

ప్రజాశక్తి - వాకాడు

స్మశానానికి దారి చూపాలని మండలంలోని తిరుమూరు పంచాయతీ వావిలపాలెం ఎస్‌టి కాలనీ వాసులు వేడుకున్నారు. బుధవారం పౌరహక్కుల దినోత్సవం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ డివిజన్ మానిటరింగ్ మెంబర్ కూరపాటి రవీంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనవాసులు తమ సమస్యలను విన్నవించారు. తాము నివసిస్తున్న గృహాలు నివాసయోగ్యంగా లేవని, 30 ఏళ్లుగా స్మశానానికి దారి లేదన్నారు. సర్పంచి లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటిపట్టాలు ఇప్పించండి మహాప్రభు

ప్రజాశక్తి - రేణిగుంట

కరకంబాడి పంచాయతీ గుట్టపై దాదాపు గుర్తు తెలియని రెండువేల మంది పేదలు గుడారాల పండుగను తలపించేలా బుధవారం గుడారాలను వేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తమకు సొంతిల్లు లేదని, ఇంటి పట్టాలు లేవని అన్నారు. గుట్టపై ఉన్న ఖాళీ జాగాలో గుడారాలు వేసుకుని ఉంటానికి సిద్ధపడ్డామని, ఇంటి పట్టాలు ఇప్పించాలని రెవెన్యూ వారిని ప్రాథేయ పడుతున్నారు. ఖాళీ స్థలాన్ని పేదలకు ఇచ్చి తమ సొంత ఇంటి కలను నెరవేర్చాలన్నారు. జగనన్న ప్రభుత్వంల తమకు ఇంటి పట్టాలు రాలేదని, అందుకే ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకుని ఉండటానికి సిద్ధమయ్యామన్నారు. ఈ విషయమై రెవెన్యూ సిబ్బంది స్పందిస్తూ ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా గుడారాలు వేసుకోకూడదని, ఒకవేళ వేసుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నిజమైన పేదవారు ఉంటే అలాంటివారికి కచ్చితంగా ఇంటిపట్టాలు ఇచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా వారం రోజులుగా పేదలు ప్రభుత్వంపై నమ్మకం లేక గుడారాలు వేసుకుని ఇంటి పట్టాలు ఇచ్చేంత వరకూ అక్కడనుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు.

జగనన్న స్థలాలు చూపనందున తాము వేసుకున్న గుడిసెల వద్దనే పట్టాలివ్వాలంటూ బాధితుల నిరసన

కలెక్టర్ లక్ష్మీషా బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో సంతోషంగా ఉందని, జిల్లాను అన్ని శాఖల సమన్వయంతో ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా అన్నారు. బుధవారం తెల్లవారుజామున కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకున్న లక్ష్మీషా, అనంతరం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయనకు అర్చకులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలుకగా, జెసి శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల కిషోర్ వెంట రాగా కలెక్టర్ ఛాంబర్ నందు లక్ష్మీ షా తిరుపతి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్లు జిల్లా కలెక్టర్ కు పుష్ప గుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల, తిరుపతి కి ఎంతో చారిత్రక ప్రాముఖ్యత, ప్రాశస్త్యం ఉన్నదని, జిల్లా ప్రగతి ఒక్కరితో సాధ్యం కాదని, ఇది అన్ని శాఖల సమన్వయంతో సాధ్యమని, జిల్లా యంత్రాంగాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివద్ధి పథకాలు అర్హులైన ప్రతి పేద ప్రజానీకానికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో

జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పనిచేయడం ఎంతో ఛాలెంజ్ గా తీసుకొని ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఆదేశాలమేరకు పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ అభివద్ధి పథకాల అమలుతో పాటు తిరుపతి జిల్లాలో ప్రోటోకాల్ బాధ్యతలను సమర్థవంతంగా ప్రజా ప్రతినిధులు, టీటీడీ చైర్మన్, ఈఓ, ఎస్పీ తదితరులతో సమన్వయం చేసుకొని చేపడతామని తెలిపారు. జర్నలిజం ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా పాత్రికేయులు కళ్ళు, చెవులుగా నిర్మాణాత్మక విమర్శ, ఫీడ్ బ్యాక్ తో సమ సమాజ నిర్మాణానికి తోడ్పడేలా ఉండాలని వారు కోరారు. అనంతరం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ని కలెక్టర్ మర్యాద పూర్వకంగా వారి నివాసంలో కలిశారు.

శ్వేత డైరెక్టర్‌గా భూమన సుబ్రమణ్యం రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టీటీడీకి చెందిన శ్రీ వెంకటేశ్వర ఉద్యోగుల శిక్షణా అకాడమీ (శ్వేత) డైరెక్టర్ గా భూమన్ (భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి) బుధవారం బాధ్యతలు చేపట్టారు. టిటిడి కళాశాల లో సుదీర్ఘ కాలం అధ్యాపకుడుగా పని చేసి పదవీ విరమణ చేసిన భూమన్ రాయలసీమ ఉద్యమ నాయకుడుగా, ఉపన్యాసకులుగా ప్రసిద్ధి చెందారు. గతంలో శ్వేత డైరెక్టర్ గా పని చేసారు. ఆ సమయంలో ఉద్యోగుల శిక్షణా కార్యక్రమాలతో పాటు తరిగొండ వెంగమాంబ ప్రాజెక్ట్ ఏర్పాటు కు, టి టి డి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కు విశేష కషి చేసారు. ఆయన సోదరుడు భూమన కరుణాకర్ రెడ్డి ప్రస్తుతం తిరుపతి శాసనసభ్యుడు, టి టి డి చైర్మన్ గా ఉనా ్నరు. ఇటీవలి ధర్మకర్తల మండలి తీర్మానం ప్రకారం భూమన్ ను మరోసారి శ్వేత డైరెక్టర్ గా నియమిస్తూ టి టి డి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం రెండేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన శ్వేతా భవనం వద్ద బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

విజయసింహా రెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సమాచార శాఖలో విజయసింహా రెడ్డి సేవలు మరువలేనివని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య అన్నారు. తిరుపతి డిపిఆర్ఓ గా పనిచేస్తున్న విజయసింహారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి డిఐపిఆర్ఓ బాలకొండయ్య మాట్లాడుతూ... నేటితో ఉద్యోగ విరమణ చేసిన డిపిఆర్ఓ విజయసింహారెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని సమాచార శాఖ అధికారులు, సిబ్బంది పని చేయాలని పేర్కొన్నారు. సుమారు 33 సంవత్సరాలు సమాచార శాఖలో వివిధ హెూదాల్లో పనిచేసిన విజయసింహారెడ్డి సమర్థవంతంగా తన విధులను నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలను పొందారన్నారు. విజయ సింహ రెడ్డి మాట్లాడుతూ... అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో తాను సమాచార శాఖలో 33 ఏళ్లుగా సంతప్తికరంగా విధులు నిర్వహించారన్నారు. ఇందుకు సహకరించిన ఉన్నతాధికారులు, సిబ్బంది అందరికీ కతజ్ఞతలు తెలియజేశారు. డిపిఆర్ఓలు పురుషోత్తం, వెంకటరమణ, సమాచార శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్లు చంగల్ రెడ్డి, జయలక్ష్మి తో పాటు, డివిజనల్ పిఆర్ఓ మస్తాన్, ఈశ్వరమ్మ, సుబ్బరామయ్య, రిటైర్డ్ ఏవీఎస్ లు సుబ్రహ్మణ్యం కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపేది ఉపాధ్యాయుడు : డిఇఒ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపేది ఉపాధ్యాయుడైనని డీఈఓ వి శేఖర్ తెలిపారు. నగరపాలక ప్రాథమిక పాఠశాల, సింగాలగుంట ప్రధానోపాధ్యాయులు పసల దొరసామయ్య ఉద్యోగ విరమణ బుధవారం జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి. శేఖర్ మాట్లాడుతూ విద్యాశాఖలో ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయుడుగా 40 సంవత్సరములు సుదీర్ఘకాలం పనిచేసి ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి నేడు ఉద్యోగ విరమణ చెందుతున్న పసల దొర స్వామి సేవలు అమోఘం అన్నారు. సింగాలగుంట 38వ డివిజన్ కార్పొరేటర్ పి నరేంద్రనాథ్, తిరుపతి అర్బన్ ఎంఈఓ



లు బాలాజీ ,భాస్కర్ నాయక్, నారాయణ వనం ఎంఈఓ ప్రభాకర్ రాజు, రేణిగుంట ఎంఈఓ రంగనాథయ్య ,చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధారాణి ,ఎస్ టి యు నాయకులు గాజుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ అధికారుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ జనరల్ మేనేజర్లుగా పదవీ విరమణ చేసిన సి. శారద, పి. నాగరాజుల సేవలు అభినందనీయమని ఆ సంస్థ డైరెక్టర్ ఎన్.వి.ఎస్. సుబ్బరాజు పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని అనెక్స్ బిల్డింగ్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ లో వివిధ హెూదాల్లో వారు నియోగదారులకు అందించిన సేవలను కొనియాడారు. ఉద్యోగ ప్రయాణంలో పదవీ విరమణ అనేది తప్పనిసరని, ప్రతి ఉద్యోగి నిర్ణీత సమయం తర్వాత పదవీ విరమణ చేయాల్సిందేనని అన్నారు. వారు కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, డి.ఎస్. వరకుమార్, వై లక్ష్మీ నరసయ్య, కె. గురవయ్య, కె.ఆర్.ఎస్. ధర్మ జ్ఞాని, వి. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగం నందు పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని కొడవల శిరీషకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పి.హెచ్.డి) పట్టాను ప్రదానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ పరిశోధక విద్యార్థిని కొడవల శిరీష అల్లైడ్ హెల్త్ సైన్సెస్ విభాగం కింద బయోటెక్నాలజీ నందు ఇన్ విట్రో జనరేషన్ ఆఫ్ కెరటినోసైట్స్ ఫ్రమ్ హ్యూమన్ హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్స్ అనే అంశముపై పరిశోధనను నిర్వహించారు. విభాగాధిపతి డాక్టర్ పివిజికె శర్మ పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని శిరీష సమర్పించారు. పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ అధికారికంగా ప్రకటించారు.

తిరుపతి జిల్లా తహశీల్దార్లు బదిలీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరి ఆఖరి లోపు వెలువడనున్న సందర్భంగా భారీ ఎత్తున తహశీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయలసీమ జిల్లాలో పెద్ద ఎత్తున తహశీల్దార్లు బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లాలో నాలుగు సంవత్సరాలు పైబడి పని చేస్తున్న వారిని బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యింది. తిరుపతి జిల్లాలోని బదిలీ అయిన తహశీల్దార్ల వివరాలు ఇలా ఉన్నాయి. వీరంతా ఆయా జిల్లాల్లో రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రాంతం	పేరు	ఎక్కడకు...
తిరుపతి అర్బన్	వెంకటరమణ	వైఎస్ఆర్ జిల్లాకు
రేణిగుంట	ఉదయ్ సంతోష్	కర్నూలు
తొట్టంబేడు	జె.నిత్యానందబాబు	అనంతపురం
ఏర్పేడు	శివప్రసాద్	వైఎస్ఆర్ జిల్లా
కెవిబిపురం	సి.శ్రీదేవి	అనంతపురం

పిచ్చాటూరు	యు.మధుసూదనరావు	వైఎస్ఆర్ జిల్లా
నారాయణవనం	ఎస్.ప్రమీల	వైఎస్ఆర్ జిల్లా
తిరుపతి రూరల్	టివి సుబ్రమణ్యం	అనంతపురం
చంద్రగిరి	పి.శిరీష	వైఎస్ఆర్ జిల్లా
పాకాల	కెపి భాగ్యలక్ష్మి	వైఎస్ఆర్ జిల్లా
రామచంద్రాపురం	సి.వెంకటేశ్వర్లు	నంద్యాల (కర్నూలు జిల్లా)
వడమాలపేట	ఐ.సుబ్రమణ్యం	వైఎస్ఆర్ జిల్లా
పుత్తూరు	జె.పరమేశ్వరస్వామి	అనంతపురం
యర్రావారిపాలెం	యు.దస్తగిరయ్య	అనంతపురం
చిన్నగొట్టిగల్లు	ఎం.లోకేశ్వరి	అనంతపురం
ఎండోమెంట్ తహశీల్దార్	వై.రమేష్‌బాబు	వైఎస్ఆర్ జిల్లా
ఎండోమెంట్ స్పెషల్	ఆర్.వెంకట లక్ష్మమ్మ	వైఎస్ఆర్ జిల్లా
నాగలాపురం	ఎ.ప్రసన్నకుమార్ (జూన్‌లో ఉద్యోగ విరమణ, బదిలీ కాలేదు)	

రైతన్నకు టిడిపి అండ: పులివర్తి వినీల్

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రైతన్నకు టిడిపి అండ వుంటుంది..' అని వచ్చే సాధారణ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమ తండ్రి పులివర్తి నానిని గెలిపించాలని టిడిపి యువ నాయకుడు పులివర్తి వినీల్ విస్తృత ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని కట్ట కింద వెంకటాపురం గ్రామ పంచాయతీలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ'ని నిర్వహించారు. పంచాయతీలోని ప్రతి ఇంటి ఇంట్లు, తెట్టె వారి పల్లి, కట్ట కింద వెంకటాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలు పులివర్తి వినీల్ కి అపూర్వ స్పందన లభించింది. పులివర్తి వినీల్ మాట్లాడుతూ టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి, మాజీ సర్పంచ్ కె రాఘవేంద్ర నాయుడు, ఎం ఢిల్లీనాథ్‌రెడ్డి, కె ధనంజయ రెడ్డి, జయ చంద్ర నాయుడు, కె గిరిధర్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్: తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్లో జాతీయ నాయకుల విగ్రహాలు ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామకుమార్ రెడ్డి, యస్‌వీయస్ చైర్మన్, వెంకటగిరి రాజా, వివిటి సాయికృష్ణ యాచేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు జగన్ ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలల కు దీటు గా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసిన జగన్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ ఛైర్పర్సన్ నక్క భానుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'టిడిపి జయహో బిసి' సభ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలో గురువారం ఉదయం 10 గంటలకు మండల టిడిపి ఆధ్వర్యంలో 'జయహో బీసి' నిర్వహించనున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు జి నరసింహ యాదవ్, టిడిపి సీనియర్ బీసీ నేత సి ఆర్ రాజన్ లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు. బీసీలందరూ హాజరుకావాలని కోరారు. బీసీలను చైతన్య పరిచి, రానున్న సాధారణ ఎన్నికల్లో బీసీ లందరూ టిడిపికి అండగా నిలిచేలా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

టిడిపిలో భారీ చేరికలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సమక్షంలో బుధవారం వంద కుటుంబాలు టిడిపిలో చేరాయి. మహాజన సైన్యం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సురేంద్ర, తిరువెంగళాయపల్లి గ్రామానికి చెందిన 100 కుటుంబాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ తాను ప్రజలకు అండగా ఉంటానని వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయానికి తిరువెంగళాయ పల్లి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కమిటీ నాయకుడు భాస్కర్ రెడ్డి వెంకటేశ్వర్లు రాజు, చొదరామయ్య పాల్గొన్నారు. కోట మండలం కర్లపూడి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు కోట మండల అధ్యక్షుడు సర్వోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు.

ఘనంగా నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి -కోట: కోట మండలంలో నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి 35వ వర్ధంతి వేడుకలను కోటమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి విగ్రహం వద్ద నల్లపరెడ్డి అభిమానులు ఘనంగా పూలమాలలతో నివాళులు అర్పించారు. నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఇంటి వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సీనియర్ టిడిపి నాయకులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, వాకా విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కార్తికేయ మినరల్స్ అధినేత రాయపు సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు వెంకట కృష్ణయ్య, కోట యువ నాయకులు మీజూరు రంగ పాల్గొన్నారు.

ఆదరిస్తే అందరిని ఆదుకుంటా: పులివర్తి నాని

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: రానున్న 2024లో ఎన్నికలలో ఆదరించి చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపించి అందరినీ ఆదుకుంటా, సామాజికంగా ఆదుకుంటానని టిడిపి ఇన్‌ఛార్జి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో బుధవారం 'జయహో బీసీ'ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి టిడిపి ఇన్‌ఛార్జి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానితో పాటు పలువురు బిసి నాయకులు హాజరయ్యారు. జనసేన నాయకులు మాట్లాడుతూ టిడిపి జనసేన ఉమ్మడి కార్యాచరణతో రానున్న 2024 ఎన్నికలలో రాష్ట్ర జగనన్న పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఓజిలి : టిడిపితోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని సూళ్లూరుపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జయహో బిసి సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి బిసి జిల్లా అధ్యక్షులు సదాశివం, జిల్లా పార్లమెంట్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి పాటి వెంకటసుబ్బయ్య, టిడిపి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి,ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్,ఖలీల్, చింతల సరోజనమ్మ, వంకాయల వెంకటేశ్వర్లు, ఆళ్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలో 'జయహో బీసీ' సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, టిడిపి ఇన్‌ఛార్జి కురుగొండ్ల రామకృష్ణ, జనసేన ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో పాటు టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, జనసేన ట్రస్ట్ అధినేత, రాష్ట్ర కార్యదర్శి గంగోడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థికి ట్యాబ్ పంపిణీ

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ఉపాధ్యాయులు బోధించే బోధనాంశాలు వినికిడి లోపంతో విద్యలో వెనుకబడిపోతున్న విద్యార్థికి ఎంఈఓ లు 1 వెంకయ్య, 2 కృష్ణయ్యలు ట్యాబ్ పంపిణీ చేశారు.బుధవారం ఏకొల్లు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థి కొప్పల పవన్ కుమార్ కు జిల్లా సర్వ శిక్ష అభియాన్ నుండి విద్యార్థికి ట్యాబ్ ను ఎంఈఓ లు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టి ఉపాధ్యాయులు ప్రవంతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో 'గడప గడప కు కాంగ్రెస్'ను మా.ఈ ఎంపీ చింతా మోహన్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దర్శి నాగభూషణం, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాబినెట్ నిర్ణయాలు ఉపయోగం లేనివే: దేవానంద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బుధవారం తీసుకున్న నిర్ణయాలు ఉపాధ్యాయులకు ఏ మాత్రం ఉపయోగపడవని ఏపి సిపిఎస్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రేణంటి దేవానంద్ ఒక ప్రకటనలో అన్నారు. ఉపాధ్యాయులకు మేలు చేకూర్చేలా ఆ నిర్ణయాలు తీసుకోలేదన్నారు.

ఎస్వీయూలో విసి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పరీక్షలు, అకడమిక్ విభాగాలను ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు ఉద్యోగులు అప్పటికి విధుల్లోకి రాకపోవడం గుర్తించారు. హాజరు పట్టికను పరిశీలించి విధులకు రాని వారికి గైర్హాజరు నమోదు చేశారు. మధ్యాహ్నం ఫైనాన్స్ , డెవలప్‌మెంట్ విభాగాలను పరిశీలించారు. సంబంధిత విభాగ అధికారులకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు సహకరిస్తూ, స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని సూచించారు. [illegible] తెలిపారు.

స్త్రీ శిశుమరణాలను తగ్గించాలి

ప్రజాశక్తి - బాలాయపల్లి : రక్తహీనతతో పిల్లలు, గర్భవతులు, బాలింతలు మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఆరోగ్య శాఖ సిబ్బంది పని చేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ డిపిఎం డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కామకూరు, బాలాయ పల్లి పీహెచ్‌సీల పరిధిలో రక్తహీనత ఉన్న పిల్లలను గర్భవతులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. అనంతరం హెచ్ బి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర కుమార్, డి పి హెచ్ ఎన్ ఓ బేబీ రాణి పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాలు కల్పించండి'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దిగువ కనకంపాలెం గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు కల్పించాలని తిరుపతి ఎంపీ గురుమూర్తిని దిగువ కనకంపాలెం గ్రామ ప్రజలు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో అంగన్‌వాడీ భవనం పూర్తి చేయాలని, కల్వర్టు నుండి గ్రామం వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ కాలువలు కొత్తగా నిర్మించాలని, కొత్తగా హౌసింగ్ ఇళ్లు ఏర్పాటు చేయాలని కోరారు.

కష్టాల కడలిలో ఇటుక బట్టీ కార్మికులు

- చాలీచాలని కూలి
- అందని ప్రభుత్వ పథకాలు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: మండల వ్యాప్తంగా ఇటుకల బట్టీలలో పనిచేస్తున్న వందల మంది కార్మికులు రోజూ గిట్టుబాటు కాని కూలి డబ్బుతో కడుపు నిండని తిండితో జీవనం సాగిస్తున్నారు. ఎక్కడో పక్క రాష్ట్రం తమిళనాడు సేలం, తదితర ప్రాంతాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి ఇటుకల బట్టీలో కూలీలుగా పనిచేస్తున్నారు. వారి నివాసానికి సౌకర్యాలు లేక ఇటుకల బట్టీల వద్దే చిన్న టెంట్లు ఏర్పాటు చేసుకుని దుర్భర జీవనం సాగిస్తున్నారు. వారికి ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడంలేదు. అధికారులు స్పందించకపోవడంతో కష్టాల కడలిలో జీవనం సాగిస్తున్నారు.

పుత్తూరు మండలంలోని అగ్రహారం, గొల్లపల్లి, ఎగువ గూళ్లూరు, పిళ్లారిపట్టు, తాయిమాంబాపురం, తడుకు, ఈసలాపురం, ఎగువగూళ్లూరు, తిరుమలకుప్పంచ కెబిఆర్‌పురం, తదితర ప్రాంతల్లో ఇటుకల బట్టీలు వందల సంఖ్యలో వున్నాయి. వీటి పరిధిలో సుమారు 350 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి రోజుకు 350 నుంచి 400 రూపాయల వరకు కూలి వస్తోంది. తమిళనాడు సేలం, మహారాష్ట్ర, ఒడిస్సా, బీహార్ రాష్ట్రాల నుంచి కార్మికులు తమ కుటుంబాలతో వలస వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. ఇది తమ జీవనానికి ఏమాత్రం చాలడం లేదని నిత్యావసరాలు ఆకాశాన్ని అంటిన ప్రస్తుత రోజుల్లో రోజుకు రెండు పూటలు మాత్రమే పొట్ట నింపు కుంటున్నామని వారు వాపోతున్నారు. తమకు వచ్చే కూలి చాలదని యజమానిని ప్రశ్నిస్తే పని మానేయాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తమకు మరో పని తెలియక, మరో చోటుకి వెళ్లలేక చాలాకాలంగా వీటిపైనే ఆధారపడి బతుకుతున్నామని వాపోయారు.

నివాసానికీ కష్టమే..

ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన కార్మికులకు పనిచేస్తున్న ఇటుకల బట్టీలే నివాస స్థలాలుగా మారాయి. ఇటుక బట్టీల యాజమానులు కేటాయించిన స్థలంలోనే వారు రేకుల షెడ్లు, చిన్న పాటి టెంట్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. చాలీచాలని టెంట్లలో వర్షం, చలికి, ఎండకు

తీవ్ర కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని ప్రభుత్వ పథకాలు

సుదూర ప్రాంతాలు (రాష్ట్రాల) నుంచి వచ్చిన తమకు ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడంలేదని వాపోతున్నారు. అధికారులను అడిగితే రేషన్ కార్డులు వుంటేనే పథకాలు వస్తాయని పేర్కొంటున్నారని తెలిపారు. తమ సొంత ప్రాంతాల్లోనూ తమకు రేషన్ కార్డులు లేవని చాలా రోజుల క్రితమే వలస వచ్చామని కార్మికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి తమకు రేషన్ కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

పిల్లలకూ అందని విద్య

కార్మికుల పిల్లలకూ సరైన విద్య అందడంలేదు. తమకు సమీపంలో పాఠశాలలు ఎక్కడ వున్నాయో, ఎలా చేర్చాలో తమకు తెలియడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యను అందించాలని వారు కోరుతున్నారు.

క్రైం న్యూస్

వరకట్న వేధింపులు తాళలేక గర్భిణి ఆత్మహత్య

వరకట్న వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న జాస్మిన్

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని కాపుగున్నేరి పంచాయతీ ఇసుకగుంట గ్రామానికి చెందిన జాస్మిన్ (21) వరకట్న వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సిఐ అజయ్ కిషోర్ తెలిపిన కథనం మేరకు జాస్మిన్ అదే గ్రామానికి చెందిన అమీర్ సోహిల్‌తో మూడు సంవత్సరాలు క్రితం వివాహమైంది. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో వరకట్నం కోసం అత్త, భర్త వేధిస్తున్నారని వారి బాధలు భరించలేక తమ కుమార్తె జాస్మిన్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు వున్నాడు. ప్రస్తుతం ఏడు మాసాల గర్భిణీగా వుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

శ్రీవారి దర్శనం కోసం వచ్చిన బస్సు డ్రైవర్ హత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి దర్శనం కోసం సుదూర ప్రాంతం నుంచి యాత్రికులను తీసుకొని వచ్చి తిరుపతిలో విశ్రాంతి తీసుకుంటున్న డ్రైవరు దారుణ హత్యకు గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు అలహాబాద్ కు చెందిన డ్రైవర్ చంద్రసేన తివారి (52) 55 మంది శ్రీవారి భక్తులలో చత్తీస్‌గడ్ కోర్బా నుండి ప్రైవేటు వాహనంలో మంగళవారం తిరుపతికి వచ్చారు. యాత్రికులు తిరుపతిలో బస్సు నుంచి తిరుమలకు శ్రీవారి దర్శనార్థం వెళ్లారు. పాత తిరుచానూరు రోడ్డు లోని ప్రైవేటు వాహనాలు నిలిచే స్టాండ్ లో బస్సులు పార్క్ చేశారు. బస్సులో డ్రైవర్ చంద్రసేన తివారి, క్లీనర్ నిరంజన్ మాత్రమే ఉన్నారు. బుధవారం ఉదయం డ్రైవర్ చంద్ర సేన తివారి బస్సులో తీవ్ర రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండడానికి స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు, సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లీనర్ నిరంజన్ డ్రైవర్ తివారిని రాయితో తలపై బలంగా మోది హత్య చేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. హత్యకు 'పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? ఆర్థిక లావాదేవిలు ఏమైనా ఉన్నాయా?' కోణంలో విచారిస్తున్నట్లు సిఐ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి: జెసి

ప్రజాశక్తి- రామచంద్రాపురం: మండలంలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని సి రామాపురం సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'జగనన్న కాలనీ లేఔట్ లో ఎన్ని పట్టాలు మంజూరు చేశారు?' ఎంతమంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేశారు?' అని పంచాయతీ కార్యదర్శి పద్మారాణి, వీఆర్వో ఝాన్సీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ స్వయంగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలను రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రయత్నించగా సర్వర్ మొరాయించింది. దీంతో కొంతసేపు సచివాలయంలో కూర్చున్నారు. సర్వర్ పనిచేసిన వెంటనే లబ్ధిదారులను పిలిపించుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ సుశీలా దేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న జెసి శుభం బన్సల్

'ఆడుదాం ఆంధ్ర' జిల్లా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి తిరుపతి సిటీ: 'ఆడుదాం ఆంధ్ర' జిల్లా స్థాయి పోటీలు బుధవారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. స్థానిక తారక రామ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి తిరుపతి జిల్లా అధికారి క్రీడా అధికారి సయ్యద్ సాహెబ్, గౌరవాధ్యక్షుడుగా తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల ద్వారా అనేకమంది గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాకి చెందిన ఇద్దరు అంతర్జాతీయ క్రీడాకారు ఎన్ సుజన్, వి కార్తీక్ లను సన్మానించారు. డి ఎస్ డి ఓ సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ కోకో, వాలీబాల్ ,క్రికెట్ , కబడ్డీ షటిల్ బ్యాడ్మింటన్ జెట్లకి సంబంధించిన బాలురు, బాలికల జట్లు తిరుపతి జిల్లాలోని 7 నియోజకవర్గాల జట్లు పాల్గొంటాయని రెండు రోజులు జరిగే పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాబ్ కోచ్ మాలిని, గోపి, హిందూజా, ప్రేమ్, వినోద్, ఆది, ఫిజికల్ డైరెక్టర్లు పి ప్రభాకర్ రావు, పి బాబు, టిమ్ మేనేజర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రముఖులు

ఆర్‌టిసి దుకాణాల తొలగింపుపై జాప్యం ఎందుకు?

ఆర్‌డీవోను నిలదీసిన వైసీపీ నాయకులు

ప్రజాశక్తి -కోట : గత రెండు నెలలుగా పంచాయతీ నుండి నోటీసులు దుకాణదారులకి జారీ చేసినా ఆర్టీసీ దుకాణాల తొలగింపు పై జాప్యం చేయడం ఏమిటని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌ని నిలదీశారు. ఈ సందర్భంగా బుధవారం కోట మండలంలోని ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన 'జగనన్నకి చెబుదాం' కార్యక్రమంలో ఆర్టీసీ దుకాణాలను తక్షణమే తొలగించాలని వినోద్ కుమార్ రెడ్డి ఆర్డీవో కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌డివోతో మాట్లాడుతూ ఆర్టీసీ దుకాణాలను తొలగించాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చినా, స్థానిక కోట పంచాయతీ నుండి నోటీసులు జారీ అయినా దుకాణదారులు నిమ్మకు నీరెత్తినట్టినట్లు ఉండడం విడ్డూరంగా వుందన్నారు. ఆయా దుకాణాలను తొలగించి నూతనంగా కొత్తవారికి , లేదా ప్రాతిపదికన పాత వారికి లేదంటే పంచాయతికి అప్పగించాలన్నారు. ఆర్టీసీ దుకాణాలను తొలగించాలని వాకాడు సిఐ, కోట ఎస్ఐ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు కోర్టు నుండి ఆర్డర్ వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆర్డీవోకు తెలిపారు. అనంతరం ఆర్డీవో స్పందించి తక్షణమే ఆర్టీసీ దుకాణాల తొలగింపు పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భవాని, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు కు తెలిపారు.

'సిద్ధం' పోస్టరు ఆవిష్కరణ

ప్రజాశక్తి- నారాయణవనం: నారాయణవనం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో 'సిద్ధం' పోస్టర్‌ను ఎంపీపీ దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ, సత్యవేడు నియోజకవర్గం సమన్వకర్త మద్దల గురుమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ మండల అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. శ్మశానాలకు దారులు, డ్రైనేజ్ కాలువలలో ఉపాధి పనులు చేపట్టా లని సూచించారు. కొండలచెరువు సబ్ సెంటర్ నిర్మాణానికి 5 లక్షలు రూపా యలు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేయించారు. ఉద్యానవన పంటలు, పూల మొక్కల పంటలను సాగుచేస్తున్న రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించాలన్నారు. పవర్ లూంల కరెంట్ బిల్లుల విషయంపై గతంలోనే వెంకటగిరి సభలో తీర్మానం చేశామని, త్వరలో ముఖ్యమంత్రి దృష్టి కి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ కార్యాల యాలకు వచ్చే ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సామాన్యులను వారి స్థాయిని బట్టి గౌరవించి సకాలం లో స్పందించి పనులను పూర్తి చేయించా లని అధికారులకు సూచించారు. 20 రోజుల్లో మండలంలో పెండింగ్ బిల్లులను ఎం బుక్ రికార్డ్ చేయించి, సంబంధిత ఉన్నత అధి కారులకు పంపితే తాను సిఫార్సు చేసి బిల్లులు మంజూరయ్యేలా చొరవ తీసుకుంటారని తెలిపారు. అనంతరం నారాయణవనం స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి తిరుపతి ఎంపీ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్ రెడ్డి మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీడీవో కృష్ణమూర్తి, తహశీల్దారు ప్రమీల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

'సిద్ధం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి గురుమూర్తి

వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-బి యన్ కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం బస్టాండ్ సమీపంలో మండలం లోని వైసిపి సీనియర్ నాయకులు కోనేటి ఆదిమూలం వైఖరికి నిరసనగా దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఇటీవలే విజయవాడలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ను కోనేటి ఆదిమూలం, కోనేటి సుమన్ కలవటాన్ని నిరసిస్తూ బి యన్ కండ్రిగ మండల కార్యకర్తలు, నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, జొన్నల గోపాల్ రెడ్డి ఉగ్గుమూడి గురునాథం, కంచన పుత్తూరు గురవయ్య,ప్రసాద్ పాల్, రవీంద్ర రెడ్డి,సాయి నాయుడు, కొండా గిరి , జయచంద్ర నాయుడు తలారి వెట్టు సర్పంచ్ ప్రసాద్ కుప్పయ్య, సోషల్ మీడియా టీమ్ హేమంత్, వెంకటేష్ కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: ఎమ్మెల్యే ఆదిమూలంకి 2014లో ఎమ్మెల్యే సీటు ఇప్పించింది పెద్దిరెడ్డి రామంద్రారెడ్డి అని ఆయనపైనే విమర్శలు చేయడం అన్యామని తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం బిఎన్ కండ్రిగ మండలం వైసిపి సీనియర్ మండల నాయకులు ఆరణి సుధాకర్ రెడ్డి అన్నారు.ఆ సమయంలో ఆర్థిక చేయూత నిచ్చారని ఆ విషయం మరిచి విమర్శించడం తగదన్నారు. ప్రస్తుతం ఎంపీ సీటు ఇచ్చినా చేసిన మేలు మరిచి విమర్శించడం వల్లే ఆ స్థానం కూడా కోల్పోయాడని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ఎండిడివో కార్యాలయంలో 'జగనన్నకు చెపుదాం'

ప్రజాశక్తి -కోట : కోట మండలంలో స్థానిక ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం 'జగనన్నకు చెపుదాం'ను ఎంపీడీవో భవాని, తహశీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి ఆర్టీసీ దుకాణాలు తొలగింపు విషయంపై ఆర్డీవోతో చర్చించారు. నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన వైసీపీ యువనేత నేదురు మల్లి హరిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సాగరమాల రోడ్డు బాధితులు పలువురి రైతులు పరిహారం అందలేదని, నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామం నుండి విశ్వనాథపుర అగ్రహారం గ్రామానికి రోడ్డు మరమ్మతులు చేయా లని గూడూరు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. సిద్ధవరం పంచాయతీ సర్పంచ్ ఇంగిలాల సుజాతమ్మ భర్త వైసీపీ సీనియర్ నాయకులు ఇంగ్లాల రామయ్య పలు విషయాలను ఆర్డిఓ కిరణ్ కుమార్‌తో మాట్లాడారు. పలువురు గ్రామస్తులు పలు సమస్యలపై ఆర్డిఓని కలిశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డివో వాణి, డిఎల్ పిఓ వెంకటరమణ, ఎంపీపీ దాసరి అంజమ్మ, జెడ్‌పిటిసి దాసరి కోటయ్య, తహశీల్దారు పద్మావతి, ఎంపీడీవో భవాని, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు సచివాలయం సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం

ఆస్పత్రి భవన ప్రారంభోత్సవంలో తుడ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి -చిన్నగొట్టిగల్లు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే సాధ్యమవుతుందని తుడా ఛైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి చెవి రెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. చిన్నగొట్టిగల్లులో ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన ముప్పై పడుకల నూతన భవనాన్ని తుడా ఛైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి చెవి రెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎంపిపీ బాలం యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో వెలుగు సంఘాల తో ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం ప్రజలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి. అమలు చేస్తున్నారన్నారు. ఎంపిపీ బాలం యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ గ్రామాన సంక్షేమం అభివృద్ధి జరుగుతుంటే టిడిపి వాళ్ళు ఓర్వలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. అనంతరం 5,50,80,086 రూపాయల ఆసరా చెక్కును మోహిత్ రెడ్డి, ఎంపిపి యుగంధర్ రెడ్డి, డిసిఎంఎస్ సహదేవ రెడ్డి, జెడ్పీటీసీ స్వరూ ప చేతుల మీదుగా వెలుగు సంఘాలకు అందిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ దేవేంద్ర బాబు, వైద్యాధికారి శ్రదర్, పార్టీ కన్వీనర్ కొండా రెడ్డి,వైస్ ఎంపీ పి దామోదర రెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచ్‌లు మనోహర్, భూపాల్ పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఆసరా చెక్కుల పంపిణీకి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ మండ లంలో 500 డ్వాక్రా సంఘా లకు సంబంధించి నాలుగు కోట్ల 28 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ కింద 4 విడత పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కరుణాకర్ రెడ్డి,ఎంపీపీ చంగల్ రెడ్డి, వైస్ ఎంపీపీ నాగేశ్వరరావు ఎంపిటీసీలు ,సర్పంచులు,డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ఆసరా చెక్కు అందిస్తున్న తుడ చైర్మన్ మోహిత్‌రెడ్డి

వెంకటగిరి: వెంకటగిరి మండలం ఎంపిడివో కార్యాలయంలో వెంకటగిరి రూరల్ మండల సహాయక పొదుపు సంఘం సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా పొదుపు సంఘాలకు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియాలో 'లక్ష్మి సిరి దండు' ప్రతిభ

- రెండో స్థానం కైవసం

రెండో స్థానం సాధించిన లక్ష్మి సిరి దండు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ టెన్నిస్ దిగ్గజం లక్ష్మి సిరి దండు బుధవారం చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా టోర్నమెం ట్లో పాల్గొని ప్రతిభ చాటారు. టెన్నిస్ క్రీడలో సింగిల్స్ విభాగం లో ఫైనల్ లో పాల్గొని రన్నర్ గా నిలిచి సిల్వర్ మెడల్‌ను కైవసం చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం తెలంగాణా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం ఇండియాలో 18 వ ర్యాంక్ , ప్రపంచ ర్యాంక్ లో 385 వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు.

రహదారికి మరమ్మతులు చేయండి..

-ఆర్‌డీవోకి వైసిపి నాయకుల వినతి

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాలెం గ్రామం నుండి విశ్వనాథపుర అగ్రహారం గ్రామానికి వెళ్లే రోడ్డు రహదారి సరిగా లేకపోవడంతో 'జగనన్నకి చెబుదాం..' కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌డివో కిరణ్ కుమార్ కి వైసీపీ యువ నాయకులు నేదురుమల్లి హరిచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి వినతి పత్రం అందించారు. ఇటీవల తుపాను కారణంగా రోడ్డు మరమ్మతులకు గురైందని, దీంతో అనేక మంది వాహన దారులు నానా రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గూడూరు ఆర్డీవోకి వివరించారు. ఈ రహదారి వల్ల వాహనదారులకు ప్రమాదాలు వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఈ రహదారి విషయమై పలుసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదని నెల్లూరు పల్లి కొత్తపాలెం యువ నాయకులు నేదురుమల్లి హరిచంద్రా రెడ్డి వాపోయారు. ఇప్పటికైనా గూడూరు ఆర్డీవో స్పందించి రోడ్డు రహదారి విషయంపై చర్యలు తీసుకుని తక్షణమే రాకపోకలకు అంతరాయం కలగకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైసీపీ నాయకులు, శానంపూడి గోపాల్ రెడ్డి, స్థానిక గ్రామస్తులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనాన్ని రెండవ మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరం తోపాటు నాణ్యమైన కూరగాయలతో రుచికరం లోపించకుండా చేసి పెట్టాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్ మాస్టర్స్ లో ఈ కామర్స్ తరగతులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఎంఎస్ ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ డెవలప్మెంట్ అండ్ ఫెసిలిటేషన్ సహకారంతో తిరుపతిలో ఉన్న జిఎస్ మాస్టర్స్ ఆధ్వర్యంలో ఈ కామర్స్ సర్టిఫికేట్ కోర్సుకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు శివనాద్ మామిళ్ళ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కామర్స్ కోర్సు జనవరి 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు తమ సంస్థలో అందిస్తున్నామని తెలిపారు. ఇందులో సుమారు 25 మంది విద్యార్థులు హాజరవుతున్నారని వారికి శివనాథ్ ప్రియదర్శిని ద్వారా ఈ కామర్స్ పై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. దీనితోపాటు స్వయం ఉపాధి కూడా ఈ కోర్సు ఉపయోగపడుతుందన్నారు. కోర్స్ అనంతరం ఎం ఎస్ ఎం ఈ మంత్రిత్వ శాఖ ద్వారా సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : 'బాబు ష్యూరిటీ –భవిష్యత్ కి గ్యారెంటీ'లో భాగంగా గూడూరు పట్టణం 1వ వార్డు లో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు పులిమిశ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, స్థానికులు గోను శివకుమార్, కస్తూరి గురవయ్య, అడపాల శివ, మహిళలు లీలావతి, మట్టం శ్రావణి పాల్గొన్నారు.

గూడూరు రూరల్: పేదలకు జనసేన అండగా ఉంటుందని జనసేన జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ రావు అన్నారు. బుధవారం చిల్లకూరు మిక్సెడ్ కాలనీలో బుధవారం జనం కోసం జనసేన, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, నాయకులు పరిమళ తిరుపాలు, పరిమళ సాయి, గుంజి హేమంత్, ముదివర్తి శశి, జోగి రాజ, పల్లం వినోద్, అడపల సుబ్రమణ్యం, శివ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వైసీపీ ప్రభుత్వం ప్రజలపై వేల కోట్లు చార్జీలు, పన్నులు మోపి ప్రజల రక్తాన్ని పీల్చుకు తింటోందని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు.బుధవారం స్థానిక 14 వ వార్డులో బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ లో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ బాబు గ్యారంటీ కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో టిడిపి, పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని మడిబాక గ్రామ పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మునెమ్మ మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతుండడంతో ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సిపాయి భరోసా కింద 52 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మడబాక సర్పంచ్ చంగల్ రాజు , వైపిపి సీనియర్ నాయకులు రవి యాదవ్, మధుసూదన్ రాజు, సుధాకర్ రాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఈఓఆర్ డి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.